కళాశాల విద్యార్థుల కథల పోటీలలో
మొదటి బహుమతి పొందిన కథ

# రెండు జడల సీత

మంజుబాబు ఎం.బి.బి.ఎస్., (ఫైనల్)
గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాదు.

వెన్నెల్లో వెల్లకిలా పడుకుని పున్నమి చంద్రుణ్ని చూస్తూ ఆలోచిస్తున్నాడు చంద్రం. నీలాకాశంలో చుక్కలు గతంలోని తియ్యని అనుభవాల్లా మిణుకు మిణుకుమంటున్నాయి.

"పాపం! ఆ అమ్మాయిని యెలాగైనా యిబ్బంది పడకుండా కాపాడాలి, తను ఏమైనా ఫర్వాలేదు."

ఆ అమ్మాయి జ్ఞాపకానికి వచ్చిన వెంటనే అతనికి చంద్రబింబానికి బదులు సరిగ్గా గుర్తుపట్టలేని వో అందమైన ముఖం కనబడ్తోంది. ఆమె హేమ్మాలినిలా వుంటుందా, వాణిశ్రీలా వుంటుందా? జయప్రదలా వుంటుందా, జయసుధలాగుంటుందా, హైపిస్టు గీతలాగుంటుందా అన్నది ఎంతసేపు ఆలోచించినా తేలడంలేదు. ఆఖరికి వో విషయం గుర్తొచ్చింది. ఆమె పేరు సీత గాబట్టి రెండు జడలుండొచ్చు, (ఎక్కడో చదివిన జ్ఞాపకం) అయితే రెండు జళ్ళ సీత యెలా వుంటుంది? తనకు తెలిసినంతవరకు రెండు జడలున్న అమ్మాయిలని గుర్తు తెచ్చుకొనే ప్రయత్నం చెయ్యసాగాడు. ఎవ్వరూ అంత బాగున్నట్లు తోచడంలేదు. లేదు ఈ రెండుజెళ్ళ సీత అందరికన్నా బావుంటుంది అనుకొన్నాడు. యిలా అనుకోడానికి వెనకాల వో కథ వుంది.

ఏవిటంటే....

ఎప్పటిలా సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చాక చంద్రానికి రూమ్ తలుపు తీసేసరికి తలుపు సందుగుండా పడవేసిన వో ఉత్తరం కనిపించింది. తను యీ రూమ్‌కు వచ్చి వారం రోజులైనా కాలేదు. యింకా ఎవరికీ అడ్రసు గూడా యివ్వలేదు, ఎవరు రాసుంటారు చెప్మా అని ఆలోచిస్తూ చింపి చదవసాగాడు.

డియర్ మధూ,

నేను శనివారం సాయంత్రం ఆరున్నర బస్సులో అక్కడికి రాగలను. నాకు ఆదివారంనాడు వో ఎగ్జామ్ ఉంది. తప్పకుండా రూమ్‌లోనే ఉండగలవు. వీలైతే బస్టాండ్‌కు రాగలవు.

ఉంటాను,
సీత.

అంతా చదివాక ఆశ్చర్యపోయి అడ్రసు చూశాడు చంద్రం. అది మధుసూదనరావు అనే పేరుతో వుంది. అప్పుడతనికి గుర్తొచ్చింది తను రూమ్‌లోకి రావడానికి పూర్వం ఈ గదిలో మధుసూదనరావు అనే వ్యక్తి ఉండేవాడనీ, అతను ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోతేనే తనకి గది దొరికిందనీ. వెనక అడ్రసుందేమోనని వెదికితే లాభం లేకపోయింది. ఆఖరికి పోష్టల్ వాళ్ళ ముద్ర కూడా సరిగ్గా గుర్తుపట్టేట్లు లేదు.

అదీ కథ. అప్పట్నుంచీ అదే ఆలోచన.

శనివారం అంటే యింక ఒక్క రోజే వుంది ఎలా? ఏం చేయాలి?

చేతివ్రాత చూస్తే గుండ్రంగా ముత్యాల్లా





అతడికి 3 నెలలు నిండాక,పాలు మాత్రమే ఇస్తే సరిపోదు
**మీ పాపాయికి కావలసినది ఫారెక్స్**
పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం

**3 నెలల వయస్సు—ఘన ఆహారం ప్రారంభించవలసిన సమయం.**
3 నెలలు నిండాక, పాపాయి పెరిగే అవసరాలకు కేవలం పాలు మాత్రమే సరిపోవు. పాపాయి చురుకుగా, తొందరగా పెరుగుతూంటాడు. అంచేత కేవలం పాలు ఇవ్వగలిగే వాటికన్నా ఎక్కువ కాలరీలు అతడికి కావాలి. పాలు తాగడాన్ని తగ్గించి, హెచ్చు కాలరీలు ఇచ్చేదీ, నమలడం అలవాటు చేసేదీ అయిన ఘన ఆహారం పాపాయికి అవసరం.

**3 నెలల వయస్సు—మరింతగా ఐరన్ కావలసిన సమయం.**
"పాపాయికి ఘన ఆహారాలు ప్రారంభించేందుకు 2-4 నెలల మధ్య వయస్సు ఉత్తమమైనది. పాలు మంచి ఆహారమే అయినప్పటికీ, ఐరన్ లేనందువల్ల అది సంపూర్ణ ఆహారం కాదు. అందుకే పాపాయికి ఐరన్ గల ఘన ఆహారాలు కావాలి!"
డాక్టర్ సుభాష్ సి. ఆర్య: "ఇన్‌ఫేంట్ అండ్ చైల్డ్ కేర్ ఫర్ ది ఇండియన్ మదర్."

**డాక్టర్లు ఫారెక్స్ ఎందుకు సిఫార్సు చేస్తారు?**
ఘన ఆహారాలు ప్రారంభించడం కోసం, ప్రత్యేకంగా తయారు చేయబడిన ఆహారం ఫారెక్స్. దీనిలో కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్లు ఉన్నాయి. ఫారెక్స్‌లో పుష్కలంగా ఐరన్ కూడా ఉంది. వీటన్నిటివల్లా ఫారెక్స్, పాపాయి సంపూర్ణమైన పెరుగుదలకు ఆదర్శవంతమైన ఘన ఆహారం.

**ఉచితం!**
"పాపాయి మొదటి ఏడాది పుస్తకం." కొత్తగా తల్లులైనవారు పిల్లల పట్ల తీసుకోవలసిన శ్రద్ధ గురించి సులభ రీతిలో వివరిస్తుంది. మీ ప్రతి కోసం ఈ క్రింది చిరునామాకు వ్రాయండి:
పి. ఓ. బాక్స్ నం. 19119, (FAR 105 T),
బొంబాయి 400 025.




డాక్టర్లు సిఫార్సు చేస్తారు ఫారెక్స్
సత్వరమైన, సంపూర్ణమైన పెరుగుదల కోసం పాపాయికి ఆదర్శవంతమైన ఘన ఆహారం
CASGLF-7-172 Tel

వుంది కొబట్టి అది రాసినమ్మాయి అందంగా వుండక తప్పదనుకొన్నాడు ఎక్కడో చదివిన విషయాన్ని గుర్తుకి తెచ్చుకొంటూ.

పాపం అతను వెళ్ళిపోయిన సంగత్తెలీక ఈ అడ్రసుకు ఉత్తరం రాసినట్లుంది. ఆ అమ్మాయిమీద బోల్డు జాలిపడి పోయాడు చంద్రం.

ఒంటరి ఆడపిల్ల ఆ రాత్రి యెక్కడ కెళ్తుంది? అందుకని తప్పకుండా తనే ఆమె కాతిథ్య మివ్వాలి. యీ నిర్ణయానికి వచ్చాక సీత యెలా వుంటుందోనని ఊహించడం మొదలెట్టాడు.

రేపే శనివారం....సాయంత్రం 'ఆమె' వస్తుంది. పొద్దున్నే లేచి గదీ అదీ శుభ్రం చేయాలి మరీ అసహ్యంగా వుంది అనుకొన్నాడు బలవంతంగా కళ్ళు మూసుకొంటూ చంద్రం. అతని కసలు నిద్ర రావడంలేదు.... ఏవేవో ఆలోచనలు.

అఖరికి కలత నిద్ర....దాంట్లో ఓ కల. ఓ అందమైన అమ్మాయి లోయలోకి దూకబోతూంటే తను రక్షించినట్లూ, ఆ అమ్మాయి అమాంతం తన్తో కలిసి డ్యూయెట్లు పాడుతూ కాశ్మీర్, బెంగుళూర్, ఊటీ... అక్కణ్నించి కోటీ కొచ్చేసరికి ఓ నల్లి కుట్టి అతని కలలకు అంతరాయం కలిగించింది. లేచి కళ్ళు నులుముకుని బోల్డు సిగ్గు పడిపోయాడు చంద్రం. ఆఫీసుకు లీవు పడేసి ఆ రోజంతా గదిని అందంగా సర్దుతూ సాయంత్రం కోసం యెదురుచూడసాగాడు.

అతనికి ఆ రోజు కాస్త ఆలస్యంగానే సాయంత్రమయింది. శుభ్రంగా తయారై బస్టాండ్ కెళదామని బయల్దేరాడు.

అప్పుడే, ఎవరో కావాలని పంపించినట్లు ఓ నల్లపిల్లి "అప్పి మంచి శకునములే, కన్యాలాభ సూచనలే. లలా లలలా" అని పాడూ పోతున్న చంద్రాన్ని ఆశ్చర్యంగా చూస్తూ అతని దారికి తొంభై డిగ్రీల కోణం చేస్తూ వెళ్ళిపోయింది.

మామూలుగా అయితే చంద్రం యివన్నీ పట్టించుకొనే రకం కాదు. కాని వెళ్ళేది అలాంటిలాంటి పని కాదు గాబట్టి గట్టిగా నిట్టూర్చి పిల్లుల్నీ, పిల్లుల్ని పెంచుకొనేవాళ్ళనీ తిట్టుకుంటూ రాబోయే 'వ్యక్తి' కోసం ఆ గదిలోనే ఉండి నిరీక్షిస్తే బాగుంటుందని తీర్మానించుకొన్నాడు మనసులో, యింకా ఏవేవో ఆలోచిస్తూ.

అనుకున్నట్లైంది. ఆరూ నలభై—బస్స్టాండునుంచి నడిచివచ్చినా మహా అయితే పదిహేను నిమిషాలకంటే తీసుకోదు ఇంకా. రాలేదేవిటి అని ఎదుర్చూస్తున్నాడు.

సెకన్లు నిమిషాలౌతున్నాయ్. నిమిషాలు.... అయిదూ....పది....అలా ఆగకుండా పరుగెత్తున్నాయ్.

చంద్రం ఆలోచిస్తున్నాడు. ఒకవేళ ప్రయాణంగాని కాన్సిలయ్యిందో? బస్సు దార్లో చెడిపోయిందో? పరీక్ష పోస్ట్‌పోన్ అయిందో? కొంపదీసి ఆక్సిడెంట్ గాని....

టక్....టక్....టక్....తలుపుమీద వేళ్ళతో కొడుతున్న చప్పుడు. లేచి చూశాడు. బయటెవరో కొత్త వ్యక్తి నిల్చుని వున్నాడు భుజాన ఎయిర్‌బ్యాగ్‌తో.

ఒహవేళ ఆ అమ్మాయివాళ్ళ తాలూకు కాదు గదా!

"ఎవరు....ఎవరు కావాలండీ?"

మధుసూదనరావని ఒకతను యిక్కడ...."

"ఆయ నీ గది ఖాళీచేసి వెళ్ళిపోయారండీ ట్రాన్స్‌ఫరైతేను. పది రోజుల క్రితమే నే వొచ్చాను దీన్లోకి."

"అలాగా" అని "అయితే ఆ వుత్తరమ్మొక్కా అందుండదు" గొణుక్కుంటూ వెళ్ళిపోన్నా దతను.

"ఇంతకీ మీ పేరు?" అడిగాడు చంద్రం అతని వెనకాల యెవరన్నా ఆడపిల్ల ఉందేమోనని తొంగిచూస్తూ.

"సీతాపతి" చెప్పేసి వెళ్ళిపోయాడతను.

పాలిపోయిన మొహంతో గాలి తీసేసిన బెలూన్లా కుర్చీలో కూలబడిపోయాడు చంద్రం నిస్సత్తువగా. ఇంకా ఓ రూపాన్నేర్పరచుకొనని రెండు జడల సీత అతని ఊహల్లోంచి చెదిరిపోసాగింది. □

# ఎవరెవరు ఎందుకోసం రాస్తున్నారు?

## నే నెందుకు రాస్తున్నాను?

(పలువురు రచయితల వ్యాసాలు)

సంకలనకర్తలు: భరాగో.-అత్తిలి నరసింహారావు.

ప్రతులకు: నవజ్యోతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్డు, విజయవాడ.

వెల: పదిరూపాయలు

పదిహేను మంది ప్రముఖ రచయితలు "నే నెందుకు రాస్తున్నాను" అనే విషయంపై వ్రాసిన వ్యాసాల సంకలనం ఈ పుస్తకం.

ఇందులో తెలుగు సాహిత్యరంగంలో తమదైన ఒక స్థానాన్ని ఏర్పరచుకున్నవారూ, ఇంకా రాస్తున్నవారూ, సాహితీ ఉపన్యాసం చేసినవారూ వ్రాసిన వ్యాసా లున్నాయి. 1965 ప్రాంతాలలో రచయితలు కొంతమంది మిత్రుల మధ్య ముఖతః వినిపించినవే (చాలా వరకు) ఈ వ్యాసాలని సంకలనకర్తలు పీఠికలో చెప్పారు. దాదాపు ఈ వ్యాస రచయితలందరూ విశాఖపట్నం నీరు తాగి, గాలి పీల్చినవారే.

"నే నెందుకు రాస్తున్నాను?" అనే ప్రశ్నకు సమాధానం యివ్వడం అనుకున్నంత తేలిక కాదు. ప్రారంభంలో ఏ రచయితా తను ఎందుకు రాస్తున్నా నన్న విషయం ఆలోచించి రాయడు. రాయగా రాయగా సాంఘిక స్పృహ ఉన్న రచయిత తప్పక ఆలోచిస్తాడు. ఈ విషయమే చాలామంది ప్రముఖ రచయితల వ్యాసాలలో కూడా వెల్లడైంది.

చాలావరకు వారు ఎందుకు రాస్తున్నారో భేషజాలకు పోకుండా చిత్తశుద్ధితోనే వ్రాశారని చెప్పడానికి సందేహంలేదు.

మొదటి వ్యాసంలో శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు "నన్నడిగితే కథ వ్రాయడం కూడా ఒక వ్యసనం, ఒక రకమైన ఆత్మన్యూనతా భావాన్ని కప్పిపుచ్చుకుందుకు రాసేనేమోననిపిస్తుంది. ఆదిలో గొప్పకోసమూ, సరదాకోసమూ, అచ్చులో పేరు చూసుకోవడం కోసమూ రాసేను, కాల్పనిక జగత్తులో విహరించడంలోని థ్రిల్ కోసమే రాసేను" అంటూ నిస్సంకోచంగా, నిజాయితీతో తాను ఎందుకు రాస్తున్నారో చక్కగా వివరించేరు. "సాంఘిక న్యాయాన్ని కూర్చాలని నేను గట్టిగా వాంఛిస్తా" నని అంటూ సాహిత్యానికి ఒక ప్రయోజనం ఉందనే నమ్మకంతో వ్యాసాన్ని ముగించారు.

"రాయడం మొదలుపెట్టిన చాలా రోజుల వరకూ ఈ ప్రశ్నకు సమాధానం నాకు తెలియదు. అంతే కాదు అది తెలుసుకోవాలని ఇచ్ఛ కూడా ఉండేది కాదు" అన్నారు శ్రీ కొమ్మూరి వేణుగోపాలరావుగారు నిస్సంకోచంగా. "మనం రాసేది మనకోసం కాదు. పాఠకులకోసం అని

